లక్ష్మీనర్సింహుడికి సుప్రభాత సేవ

యాదగిరిగుట్ట, నవంబర్ 8 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో స్వామి, అమ్మవార్ల సుప్రభాత సేవోత్సవాన్ని అర్చకులు అత్యంత వైభవంగా జరిపారు. శుక్రవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్థాన సుప్రభాతాన్ని ఆలకించి స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో సువర్ణమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. స్వామివారికి హారతినిచ్చి భక్తుల గోత్రనామాలు పేరిట సంకల్పం చేశారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యలో మధ్యాహ్నం గంటన్నర పాటు ఉభయ దర్శనాలను నిలిపివేశారు. పర్యటన పూర్తయిన అనంతరం తిరిగి దర్శనాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా అలంకరించిన అర్చకులు ఊంజల్ సేవలో తీర్చిదిద్ది తిరువీధుల్లో ఊరేగించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.14,24,782 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వర్ణగిరిలో ప్రముఖుల పూజలు

స్వర్ణగిరి ఆలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 8 : పట్టణంలోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి పూజల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి శుక్రవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాలతో వారికి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అత్యద్భుతంగా ఆలయ నిర్మాణం జరిగిందన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు.

మహిళల సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరళ్ల శారద

సఖి కేంద్రం నిర్వహణను అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద

భువనగిరి అర్బన్, నవంబర్ 8 : సఖి కేంద్రానికి వచ్చిన మహిళల సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరళ్ల శారద అన్నారు. పట్టణంలోని సఖి కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సఖీ కేంద్రానికి వచ్చిన మహిళలకు ఇస్తున్న కౌన్సెలింగ్‌ను, ఇప్పటి వరకు కేంద్రంలో నమోదైన 1,311 కేసుల వివరాలను తెలుసుకున్నారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులున్నా వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి కుటుంబానికి చేరేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు, సఖి కేంద్రం ప్రెసిడెంట్ డాక్టర్ ప్రమీళ, సీడీపీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- డీసీహెచ్ఎస్ చిన్నూనాయక్

దవాఖానలో వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న చిన్నూనాయక్

రామన్నపేట, నవంబర్ 7 : దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ చిన్నూనాయక్ అన్నారు. శుక్రవారం రామన్నపేట దవాఖానను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వార్డుల్లో తిరిగి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ బి.వీరన్న, సివిల్ సర్జన్ ఈశ్వర్, అసిస్టెంట్ సివిల్ సర్జన్ మాధవాచారి ఉన్నారు.

కొండపోచమ్మకు పూజలు

కొండపోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్ సతీమణి సువర్ణ

రాజాపేట, నవంబర్ 8 : కోరిన కోరికలు తీర్చి కొంగుబంగారంగా నిలిచే కొండపోచమ్మ ఆలయంలో శుక్రవారం ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భిక్షమయ్యగౌడ్ సతీమణి బూడిద సువర్ణ, కూతురు ప్రసన్నవాణి ఒడి బియ్యం సమర్పించి ముడుపు చెల్లించుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ యువజన నాయకుడు బిళ్లకుదురు రాజు నూతన గృహప్రవేశానికి హాజరయ్యారు. వారి వెంట బీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, నాయకులు నాని, నరేశ్ ఉన్నారు.

పోరాట సేనాని రావిని మరిచిన ముఖ్యమంత్రి

బొల్లేపల్లిలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన మాజీ ఎంపీ రావి నారాయణరెడ్డి చిత్రపటం

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 8 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సేనాని, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత, పార్లమెంట్ మాజీ సభ్యుడు రావి నారాయణరెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్మరించారు. వలిగొండ మండలం సంగెం గ్రామం మూసీ కాల్వ వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి శుక్రవారం మంత్రులతో కలిసి మండలంలోని బొల్లేపల్లి గ్రామం మీదుగా కాన్వాయ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెళ్లారు. ఆయన రాకను పురస్కరించుకుని బొల్లేపల్లి గ్రామస్తులు రావి నారాయణరెడ్డి చిత్రపటాన్ని గ్రామంలోని మల్లన్న గుడి వద్ద ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి చేతులమీదుగా నివాళులర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ. ఆ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రాకపోవడంతో రావి నారాయణరెడ్డి అభిమానులు, గ్రామస్థులు అసంతృప్తికి లోనయ్యారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చెరుగని ముద్ర వేసిన రావి నారాయణరెడ్డి స్వగ్రామమైన బొల్లేపల్లి మీదుగా ప్రయాణం చేసి కనీసం ఆయన చిత్రపటానికి నివాళి అర్పించకపోవడం బాధాకరమని పలువురు పేర్కొన్నారు.

అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలు

- సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకుల అరెస్టులు

రాజాపేట/ ఆత్మకూరు(ఎం)/ బొమ్మలరామారం/ బీబీనగర్/ భూదాన్ పోచంపల్లి/ చౌటుప్పల్/ ఆలేరు టౌన్/ మోత్కూరు/ గుండాల/ భువనగిరి కలెక్టరేట్/ భువనగిరి అర్బన్/ రామన్నపేట/ వలిగొండ, నవంబర్ 8 : సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో శుక్రవారం పోలీసులు జిల్లా వ్యాప్తంగా అక్రమ అరెస్టులకు పాల్పడ్డారు. హామీల అమలుపై ముఖ్యమంత్రిని అడ్డుకుంటారన్న అనుమానంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, శ్రేణులతో పాటు అఖిలపక్ష, ప్రజాసంఘాల నాయకులను ముందస్తుగా ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. పలువురు నాయకులను గృహ నిర్బంధం చేశారు. రాజాపేటలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, సర్పంచుల ఫోరం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, నాయకులు బొంగోని ఉప్పలయ్యగౌడ్, ఎర్ర గోకుల జశ్వంత్, బూరుగు నర్సిరెడ్డి, చెరుకు కనకయ్య, నాగిర్తి గోపిరెడ్డిని పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆత్మకూరు(ఎం) మండలంలో బీఆర్ఎస్ విద్యార్థి, యువజన విభాగం నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్‌వీ జిల్లా కో ఆర్డినేటర్ దేవరపల్లి ప్రవీణ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు చుంచు నాగరాజు, యువజన విభాగం మండలాధ్యక్షుడు ప్రతికంఠం శంతన్‌రాజ్ ఉన్నారు. బొమ్మలరామారం మండలంలో సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు మేడబోయిన గణేశ్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు భట్కీర్ బీరప్ప, రాష్ట్ర కోశాధికారి పూడూరి నవీన్‌గౌడ్ తదితరులు అరెస్టు అయ్యారు. బీబీనగర్ మండలంలో బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జక్కి నగేశ్, బీఆర్ఎస్ పార్టీ రాఘవాపురం గ్రామ శాఖ అధ్యక్షుడు బుయ్య కిశోర్‌గౌడ్‌తోపాటు పలువురు నాయకులను వారి ఇండ్ల వద్దనే అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. భూదాన్ పోచంపల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, నాయకులు రావుల శేఖర్‌రెడ్డి, యాకరి రేణుకా నర్సింగ్‌రావు, బొచ్చు శంకరమ్మాకిష్టయ్య, ఉన్నారు. చౌటుప్పల్ మండల వ్యాప్తంగా బీఆర్ఎస్, ఎస్ఎఫ్ఐ, రైతు సంఘం నాయకులతో పాటు ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, కొత్త పర్వతాలు యాదవ్, పల్లె శివకుమార్, బర్రె రాజు, తీగుళ్ల శ్రీను, పబ్బు శివ, జాల శ్రీశైలం యాదవ్ తదితరులు ఉన్నారు. ఆలేరు పట్టణంలో అఖిలపక్ష నాయకులు పసుపునూరి వీరేశం, చెక్క వెంకటేశ్, జూకంటి పౌల్, మొరిగాడి చంద్రశేఖర్, బాంబే రవి, కల్లెపు అడివయ్య, బండెల సుభాశ్‌తోపాటు వివిధ గ్రామాల మాజీ సర్పంచులను పోలీసులు అరెస్టు చేశారు. గుండాల మండలానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులను అట్ల రాజేందర్‌రెడ్డి, గడ్డమీది మహోదయ్, జగన్‌యాదవ్, సాయి, సోమయ్య, లక్ష్మయ్యను పోలీసులు అరెస్టు చేశారు. భువనగిరి పట్టణంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం పాండు, పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్యతోపాటు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు, జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ, నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. రామన్నపేట మండల కేంద్రంలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతించవద్దని సీఎం సభను అడ్డుకోవాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునివ్వడంతో శుక్రవారం ఉదయాన్నే పోలీసులు బీఆర్ఎస్ నాయకుల ఇండ్లకు వెళ్లి అరెస్టు చేశారు. వారిని చిట్యాల, రామన్నపేట, మునుగోడు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అరెస్టు అయిన వారిలో పోశబోయిన మల్లేశం, బొక్క మాధవ రెడ్డి, సాల్వేరు అశోక్, మిర్యాల మల్లేశం, జాడ సంతోష్, పున్న వెంకటేశం, దాచంబొడ్డు వెంకటేశం, కల్లూరి నరేశ్, ఎడ్ల రామచంద్రారెడ్డి, జాల అమరేందర్‌రెడ్డి ఉన్నారు. వలిగొండ మండలం సంగెం, గోకారం గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచులు కీసరి రాంరెడ్డి, కాసుల కృష్ణ, సుర్కంటి లింగారెడ్డి, వెంకటేశం, కందారపు సురేశ్, కశమల్ల శేఖర్‌ను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల హౌస్ అరెస్ట్

చౌటుప్పల్ : సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ పాలన నడుస్తుందన్నారు. అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తే గృహ నిర్బంధం చేయడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి రాక్షస పాలన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ సుందరీకరణ చేస్తే మొదట సంతోషించేది బీఆర్ఎస్ పార్టీయే అని తెలిపారు. కానీ.. దీని పేరుతో మూసీ ఒడ్డున ఉన్న నిరుపేదల ఇండ్లను కూలగొట్టడాన్ని తాము వ్యతిరేకమన్నారు.

చౌటుప్పల్‌లో పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసిన బీఆర్ఎస్, ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆలేరు టౌన్ : అఖిలపక్ష, వివిధ సంఘాల నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

రాజాపేట : పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు

వలిగొండ : అరెస్టు అయిన సంగెం, గోకారం గ్రామాల నాయకులు

యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ యువజన నాయకులు

ఆత్మకూరు(ఎం)లో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ విద్యార్థి, యువజన విభాగం నాయకులు

బొమ్మలరామారం : పోలీస్‌స్టేషన్‌లో నాయకులు

బీబీనగర్ : బీఆర్ఎస్‌వీ నాయకుడు నగేశ్

భూదాన్ పోచంపల్లి : బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేసిన పోలీసులు

భువనగిరి అర్బన్ : అరెస్టు చేసిన బీఆర్ఎస్, సీఐటీయూ నాయకులు

రామన్నపేట అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు

ప్రజా పాలన అంటే అరెస్టు చేయడమేనా? : బీఆర్ఎస్

మోత్కూరులో అరెస్టు అయిన బీఆర్ఎస్ నాయకులు

మోత్కూరు, నవంబర్ 8 : ప్రజా పాలన అంటే అరెస్టు చేయడమేనా? అని మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ అన్నారు. శుక్రవారం వలిగొండలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను బీఆర్ఎస్ అడ్డుకోవడానికి పిలుపునివ్వడంతో మోత్కూరులో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హామీలు అమలు చేయడం చేతకాని అసమర్థ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా పాలనలో పేదలు, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడంతో రైతులు ఐకేపీ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. మోత్కూరు, అడ్డగూడూరు మండలాల్లో ఎమ్మెల్యే సామేల్ ఐకేపీ కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనుగోళ్లను పట్టించుకోవడం లేదన్నారు. పాత భవనానికి రంగులు వేసి పునఃప్రారంభించడం సిగ్గు చేటన్నారు. హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే.. పోలీసులతో ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను, ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేశ్, నాయకులు అన్నందాసు విద్యాసాగర్, చేతరాశి వెంకన్న, కూరెళ్ల అశోక్, రమేశ్ ఉన్నారు.

ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

రామన్నపేట, నవంబర్ 8 : ప్రజల పక్షాన నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన పార్టీ మండల 8వ మహాసభలో ఆయన మాట్లాడారు. ముందుగా మహాసభ ప్రారంభ సూచికగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేక అశోక్‌రెడ్డి ఎర్రజెండాను ఎగురవేశారు. అనంతరం దివంగత సీతారాం ఏచూరి, పిట్టల శ్రీనివాస్ చిత్రపటాలకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజల మధ్య వైశమ్యాలు సృష్టిస్తూ రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తుందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. రామన్నపేటలో నిర్మించతలపెట్టిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. మహాసభలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, జిల్లా నాయకులు కల్లూరి మల్లేశం, జెల్లెల పెంటయ్య, వనం ఉపేందర్, బొడ్డుపల్లి వెంకటేశం, మెడబోయిన మమత, కూరెళ్ల నర్సింహాచారి, మీర్‌ఖాజా, ఆనంద్, హన్మంతు, ఆండాలు, నగేశ్, విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే పారదర్శకంగా చేపట్టాలి

సర్వేలో ఇంటి యజమాని నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రాజారాం, ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), నవంబర్ 8 : సమగ్ర కుటుంబ సర్వేను పారదర్శకంగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి రాజారాం అన్నారు. సర్వేలో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం చేపట్టిన ఇంటి యజమాని పేరు నమోదు, ఇండ్ల గుర్తింపు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరూ సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లకు సహకరించాలన్నారు.

నిర్బంధాల నడుమ యాదగిరిగుట్ట టూర్..

పోలీసుల నిర్బంధాలు, అక్రమ అరెస్టుల నడుమ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సాగింది. మల్లాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి మోటె రమేశ్, యువజన విభాగం కన్వీనర్ దుద్దురు శ్రీశైలం, విద్యార్థి విభాగం నాయకులు చల్లూరి శ్రవణ్, శ్రీశైలం, కర్రె చంద్రశేఖర్, ఒగ్గు మల్లేశ్‌ను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గుట్టకు నిధులు ప్రకటించకపోవడం శోచనీయం

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ యాదగిరిగుట్టకు 22 సార్లు వచ్చారు. ఆయన వచ్చిన ప్రతిసారీ తక్షణ ఆర్థిక సాయం కింద రూ.100 కోట్లకు తగ్గకుండా ప్రకటించేది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో రెండు దఫాలు వచ్చారు. కానీ.. దేవస్థాన అభివృద్ధి చేయాలన్న ఆలోచన ఆయనకు లేదు. స్వామివారి ప్రసాదాలు భుజించి పోవడమే తప్ప.. ఒక్క రూపాయి కూడా ప్రకటించకపోవడం దుర్మార్గం. ఇదే ఆయన చిత్తశుద్ధికి నిదర్శనం.

- కర్రె వెంకటయ్య, బీఆర్ఎస్ గుట్ట మండలాధ్యక్షుడు

గుర్తు తెలియని యాచకుడి మృతి

యాదగిరిగుట్ట, నవంబర్ 8 : యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం రాత్రి గుర్తు తెలియని యాచకుడు మృతిచెందాడు. పట్టణ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సుమారు 50 ఏండ్ల గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. అతను 15 ఏండ్లుగా యాదగిరిగుట్ట దేవస్థానం ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడని ప్రాథమిక విచారణలో తేలింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ వెల్లడించారు.

మొబైల్స్ దొంగిలిస్తున్న వ్యక్తుల పట్టివేత

మొబైల్స్ దొంగిలిస్తూ పట్టుపడిన కరణ్‌సింగ్, భజన్‌సింగ్

ఆలేరు టౌన్, నవంబర్ 8 : పట్టణంలోని మంతపురి రోడ్డులో గల మణికంఠ మొబైల్ షాపులో మొబైల్స్ దొంగతనానికి పాల్పడిన వారిని పట్టుకున్నారు. ఎస్ఐ కె.రజనీకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మణికంఠ మొబైల్ షాపులో శుక్రవారం మధ్యాహ్నం సెల్‌ఫోన్ కావాలని ఇద్దరు పంజాబీ వాళ్లు వచ్చారు. వారికి షాపు యజమాని మొబైల్స్ చూపిస్తున్నాడు. ఈ సమయంలో ఒకరు ఫోన్లు చూస్తుండగా, మరొకరు మొబైల్ దొంగతనం చేసేందుకు ప్రయత్నించాడు. షాపు యజమాని గమనించి వారిని పట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వారిని విచారించి వరంగల్‌కు చెందిన కరణ్ సింగ్, భువనగిరికి చెందిన భజన్‌సింగ్‌గా గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నామని ఎస్ఐ రజనీకర్ తెలిపారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శివరామకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శివరామకృష్ణ

బొమ్మలరామారం, నవంబర్ 8 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బీమా పథకాలను బ్యాంక్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శివరామకృష్ణ, మర్యాల ఏపీజీవీబీ మేనేజర్ దివ్య అన్నారు. మండలంలోని మర్యాలలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కీసర ఎస్ఎన్‌టీసీఎఫ్ఎల్ ఆధ్వర్యంలో శుక్రవారం జనసురక్ష శాచురేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ స్కీమ్‌లు, ఆర్థిక మోసాలు, సైబర్ క్రైమ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ అధికారి వంశీ, ఎస్ఎన్‌టీసీఎఫ్ఎల్ మండల కో ఆర్డినేటర్ ఎల్లబోయిన విశ్వనాథ్, కౌన్సిలర్లు భానుశ్రీ, ఉమా మహేశ్వరి,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలి

- మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్

కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 8 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్ అన్నారు. పట్టణంలో కొనసాగుతున్న సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మొదటి దశలో ఎన్యూమరేటర్ బ్లాక్‌లో ప్రతి ఇంట్లో కుటుంబ వివరాలను నమోదు చేస్తూ యజమాని పేరుతో కూడిన ఇండ్ల జాబితా తయారు చేసి ఇంటికి స్టిక్కర్ వేస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 6,097 గృహాలకు స్టిక్కర్లు వేసినట్లు చెప్పారు. సర్వే పరిశీలకురాలు పుష్పలత, మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ ఆదిత్య, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

జల కాలుష్యాన్ని అరికట్టాలని సీఎంకు వినతి

భువనగిరి అర్బన్, నవంబర్ 8 : చౌటుప్పల్, భూదాన్ పోచంపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో నెలకొల్పిన రసాయన పరిశ్రమలు విడుదల చేస్తున్న వ్యర్థ జలాలను నివారించి, వాయు, జల కాలుష్యాన్ని అరికట్టి తమ ఆరోగ్యాలను కాపాడాలని కోరుతూ జిల్లాలో